


ఉపాధి పనుల్లో పారదర్శకత

- ప్రత్యేక యాప్‌తో పనుల పరిశీలన
- జీపీఎస్‌తో పని చేసే ప్రాంతాల గుర్తింపు
- అక్రమాలకు చెక్ పెట్టడమే లక్ష్యం

వివరాలు 8 లో

మూతబడుతున్న సర్కారు బడులు



- పెరుగుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలు
- 5,412 పాఠశాలలకు ఏకోపాధ్యాయులే..
- 4,265 పాఠశాలల్లో పదిలోపు విద్యార్థులు
- ఈ ఏడు భారీగా తగ్గిన అడ్మిషన్లు
- లోపాలను సరిదిద్దుకోని విద్యాశాఖ

బెంగళూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా వ్యవస్థకు ప్రాధాన్యం ఇస్తున్నామని, మౌలిక సదుపాయాల కల్పనతోపాటు విద్యార్థుల్లో పౌష్టికతను పెంచేందుకు పలు పథకాలు అమలు చేస్తున్నామని ప్రభుత్వం చెప్పుకొంటున్నా రానురాను ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి అధ్వానంగా మారుతోంది. ఇటీవల పల్లె, పట్టణం అనే తేడాలేకుండా ప్రైవేట్ విద్యాసంస్థలు పెరిగిపోతున్నాయి. రాష్ట్రంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు 46,755 ఉన్నాయి. వీటిలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 5,412 కాగా పదిమందిలోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలు 4,265 ఉండడం గమనార్హం. దీన్నిబట్టి సుమారు 10వేల పాఠశాలల పరిస్థితి దయనీయంగా తయారయ్యింది. ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు తగ్గుముఖం పడుతున్నాయి. అందుకు ఉపాధ్యాయుల కొరత ప్రధాన కారణంగా ఉంది. సర్కారు బడులకు విద్యార్థులు ఎందుకు తగ్గుతున్నారనే కోణంలో విద్యాశాఖ కనీసం పరిశీలన కూడా జరపడం లేదు. గడిచిన మూడు నాలుగేళ్లుగా ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు తగ్గుముఖం పడుతున్నాయి. ఏకంగా 4వేలకుపైగా పాఠశాలల్లో పదిమందిలోపు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. బడి మానేసిన పిల్లల సంఖ్యలో భారీ వ్యత్యాసం లేదు. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో చేరకపోవడానికి అనేక కారణాలున్నాయి. ప్రస్తుతం తల్లిదండ్రులు కూలిపనులకైనా వెళ్లి పిల్లలను మంచి విద్యా సంస్థల్లో చేర్పాలనే ఆలోచనలు పెరుగుతున్నాయి. రెండు దశాబ్దాల క్రితం పరిస్థితితో పోలిస్తే సమాజంలో మార్పులు వచ్చాయి. ఉన్న ఒకరిద్దరు పిల్లల చదువుకోసం సొంతూళ్లను వదులుకునేందుకు సిద్ధమయ్యేవారు పెరుగుతున్నారు. మంచి విద్య అందిస్తే జీవితంలో వారు స్థిరపడతారని, అంతకుమించి ఆస్తులు ఐశ్వర్యాలు సమకూర్చాల్సిన పనిలేదనే ఆలోచన తల్లిదండ్రుల్లో పెరుగుతోంది. ఇదే కారణంతోనే ఫీజుల భారం గురించి ఆలోచించకుండా ప్రైవేట్ విద్యాసంస్థల్లో చేర్పిస్తున్నారు.

తక్కువమంది విద్యార్థులు ఉన్న పాఠశాలలను శాశ్వతంగా మూత వేయకున్నా బోధనలు స్తంభించిపోతున్నాయి. విద్యార్థులసంఖ్య పెరిగితే అందుకు అనుగుణంగా సౌలభ్యాలు, ఉపాధ్యాయులను కల్పించేందుకు విద్యాశాఖ సిద్ధంగా ఉందని అభిప్రాయపడుతోంది.



750 పాఠశాలలకు స్పెషల్ గ్రాంటు

ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదులు, బెంచుల కొరత ఉంది. వీటిని అధిగమించేందుకు అమృతశాల సౌలభ్య పథకం పేరిట 750 పాఠశాలలకు శాశ్వతమైన సౌకర్యాలు కల్గిన భవనాల నిర్మాణం, గ్రంథాలయాలు, మరుగుదొడ్లు సమకూర్చేందుకు రూ.75కోట్లు కేటాయించారు. ప్రస్తుతం ఈ పనులు కొనసాగుతున్నాయి. వీటికి సంబంధించి 7,311 పనులు మంజూరు కాగా 6,146 పనులు దాదాపు పూర్తయ్యాయి. 1,133 పనులు ప్రగతి దశలో ఉన్నాయి.

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గుముఖం పడుతుండగా ప్రైవేట్ విద్యాసంస్థలు క్రమేపీ పెరుగుతున్నాయి. విద్యాశాఖ ఇటీవల ఐదేళ్లలో 2,905 ప్రైవేట్ పాఠశాలకు అనుమతులు ఇచ్చింది. ప్రభుత్వ పాఠశాలలకు సమీపంలోనే ప్రైవేట్ పాఠశాలల ఏర్పాటు అవుతుండడంతో విద్యార్థుల అడ్మిషన్లలో భారీ తేడా కనిపిస్తోంది. అత్యధిక ప్రైవేట్ పాఠశాలలకు అనుమతులు పొందిన జిల్లాల్లో విజయపుర 262, బెంగళూరు దక్షిణ 255, చిక్కోడి 174 ఉన్నాయి.



గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధ్యాయుల కొరత

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 22లక్షలమంది విద్యార్థులు చదువుతుండగా ఉపాధ్యాయుల కొరత కొన్నేళ్లుగా వెంటాడుతోంది. ఏటా అతిథి ఉపాధ్యాయులను నియమించుకుని వారి ద్వారా అకడమిక్ కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది మే నెలలో వారిని నియమించుకునే ప్రక్రియకు ఎన్నికల కోడ్ అడ్డం రావడంతో దాదాపు మూడు నెలల జాప్యం జరిగింది. పైగా 11నెలల గడువుకు మాత్రమే వారిని నియమించుకుంటున్నందున అతిథి ఉపాధ్యాయుల్లో ఆసక్తి సన్నగిల్లుతోంది. నెలసరి వేతనాలు కూడా సజావుగా రావని ఆందోళన చెందుతున్నారు. సైన్స్, గణితం బోధించే ఉపాధ్యాయుల సంఖ్య అన్ని జిల్లాల్లోనూ లోటు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి ప్రభుత్వ బడులను కాపాడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

విలీనానికే కమిషన్ ప్రతిపాదన

పాఠశాలలో పదిమందికంటే తక్కువ విద్యార్థులు ఉంటే వారికి గుణాత్మక విద్య లభించడం లేదని, అందుకే సమీపంలోని పాఠశాలల్లో విలీనం చేయాలని పాఠశాల సంస్కరణల కమిషన్ గత ప్రభుత్వానికి ప్రస్తావన పంపింది. అప్పట్లో ఈ అంశంపై వ్యతిరేకత వ్యక్తమైంది. అలాగైతే వాహన వ్యవస్థ కల్పించడం ద్వారా దూరంలోని గ్రామీణ విద్యార్థులను పాఠశాలకు పంపుతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తోంది.



మాట్లాడుతున్న రాష్ట్ర ఇన్‌చార్జ్ సుర్జేవాలా, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్

నేటి రాహుల్ నిరసన

వాయిదా

- జార్ఖండ్ మాజీ సీఎం శిబుసోరెన్ మృతి నేపథ్యంలో..
- 8వ తేదీ చేపట్టాలని నిర్ణయం

: మీడియాతో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సుర్జేవాలా

బెంగళూరు, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ఓట్ల చౌర్యానికి సంబంధించి మంగళవారం బెంగళూరులో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన భారీ నిరసన వాయిదా పడింది. ఐదు రోజులుగా ఫ్రీడం పార్కులో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం దాకా కార్యక్రమం యథావిధిగా సాగుతుందని నిర్ణయించుకుని అందుకు తగిన ఏర్పాట్లు సమకూర్చుకున్నారు. అయితే జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబుసోరెన్ మృతి చెందిన విషయమై బెంగళూరుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పర్యటనను వాయిదా వేశారు. ఇదే విషయాన్ని ఫ్రీడంపార్కులో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రణదీప్‌సింగ్ సుర్జేవాలా, కేపీసీసీ అధ్యక్షుడు, డీసీఎం డీకే శివకుమార్, ఏఐసీసీ కార్యదర్శి అభిషేక్ దత్తా మీడియాకు వివరించారు. శిబుసోరెన్ మృతికి మూడు రోజులు సంతాపదినాలు ప్రకటించినందున బెంగళూరులో జరగాల్సిన నిరసనను వాయిదా వేశామన్నారు. ఈనెల 8న శుక్రవారం యథావిధిగా సాగుతుందన్నారు. శిబుసోరెన్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు రాహుల్‌గాంధీ జార్ఖండ్ వెళ్తున్నారని సుర్జేవాలా తెలిపారు. సోరెన్ కష్టకాలంలో కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచారన్నారు. పీవీ నరసింహారావు కాలంతోపాటు నిరంతరంగా కాంగ్రెస్‌తో శిబుసోరెన్ కలసి ముందుకు నడిచారన్నారు. ఈనెల 8న శుక్రవారం వరమహాలక్ష్మీ వ్రతం పండుగ ఉన్నా నిరసన కొనసాగుతుందన్నారు. పూజలు, వ్రతం చేసుకునేవారికి అభ్యంతరం లేదన్నారు. పార్టీ కార్యకర్తలు, ముఖ్యులంతా నిరసనను విజయవంతం చేయాలన్నారు. ఇదే విషయమై త్వరలోనే లెజిస్లేచర్ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.

ఆర్టీసీ సమ్మెకు హైకోర్టు ఒకరోజు బ్రేక్

7

- సీఎంతో యూనియన్ నాయకుల చర్చలు విఫలం

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ

దంపతుల దుర్మరణం



ప్రమాదానికి కారణమైన బస్సు

సిరుగుప్ప, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు మోటారు బైకును ఢీకొని దంపతులు దుర్మరణం చెందారు. అచ్చొళ్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు సోమలాపుర గ్రామానికి చెందిన నాగభూషణ రెడ్డి (35), సంధ్య (32) బళ్లారి జిల్లా సిరుగుప్ప తాలుకా ఉడదరహాళ్ గ్రామం వద్ద బైక్‌పై వెళ్తుండగా వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న బైక్‌ను గమనించకుండా బస్సు డ్రైవర్ వేగంగా ఢీ కొట్టడంతోనే ప్రమాదం జరిగింది. బస్సు ఢీ కొనడంతో దంపతులిద్దరూ బస్సు టైర్ల కింద పడ్డారు. తీవ్ర గాయాలపాలైన వారు అక్కడికక్కడే కన్ను మూశారు. సంఘటనా స్థలానికి డీఎస్పీ సంతోష్ చౌహాన్, సీఐ హనుమంతప్ప, అచ్చొళ్లి ఎస్ఐ షఫీ చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ.. వేగంగా బస్సు నడిపిన డ్రైవర్‌పై చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం, నష్టపరిహారం చెల్లిస్తామని తెలిపారు. ఈ మేరకు అచ్చొళ్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు దాఖలైంది. దంపతుల మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరయ్యారు.



బస్సు కింద దంపతుల మృతదేహాలు

ఎస్సీ సర్వే నివేదిక అందజేత

- సీఎం సిద్దరామయ్యకు సమర్పించిన జస్టిస్ నాగమోహన్ దాస్

బెంగళూరు, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుకు రాష్ట్రప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిషన్ జస్టిస్ నాగమోహన్‌దాస్ రూపొందించిన నివేదికను ముఖ్యమంత్రికి సోమవారం సమర్పించారు. సీఎం అధికారిక నివాసంలో నివేదికను అందచేశారు. మంత్రులు పరమేశ్వర్, ప్రియాంక ఖర్గే, ఆర్‌బీ తిమ్మాపుర, మహదేవప్ప, మునియప్ప, శివరాజ్ తంగడగితోపాటు చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్ ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సర్వే జరిపిన కమిషన్ మార్చి 27న మధ్యంతర నివేదిక సమర్పించింది. అదేరోజున సమీక్ష జరిపేందుకు మంత్రివర్గం తీర్మానించింది. అందుకు అనుగుణంగా మే 5నుంచి జూలై 6వరకు సర్వే కొనసాగింది. 27,24,768 కుటుంబాలకు సంబంధించి 1,07,01,982మంది భాగస్వామ్యులయ్యారు. సమగ్ర నివేదిక 1766 పేజీలతో రూపొందించారు.



ముఖ్యమంత్రికి నివేదిక అందజేస్తున్న జస్టిస్ నాగమోహన్‌దాస్ బృందం



పంచాయతీ సభ్యుడు నారాయణస్వామిని అభినందిస్తున్న ప్రముఖులు

నాలుగున్నరేళ్ల పోరాటం

ఆరు నెలల పదవి..

దొమ్మసంద్ర, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సభ్యుడి పదవి కోసం ఏకంగా నాలుగున్నరేళ్లు పోరాడాడు. అయితే సుదీర్ఘకాలం పోరాటం అనంతరం సాధించిన పదవి ఆరు నెలలే ఉండడం బాధాకరం. బెంగళూరు నగర జిల్లా ఆనేకల్ తాలూకా దొమ్మసంద్ర పంచాయతీ 12వ వార్డు సభ్యుడు కృష్ణారెడ్డి 2020లో జరిగిన ఎన్నికల్లో నామినేషన్ వేళ కేసులను ఎదుర్కొన్నాడు. కృష్ణారెడ్డిపై పోటీ చేసి ఓడిపోయిన నారాయణస్వామి (మొదలియార్) పంచాయతీ సభ్యత్వ స్థానం కోసం ఎన్నికల అధికారులను, కోర్టును ఆశ్రయించారు. కృష్ణారెడ్డి భూకబ్జాలకు పాల్పడినట్లు నారాయణస్వామి ఆరోపించారు. సుదీర్ఘ విచారణ అనంతరం 4 సంవత్సరాల 6 నెలల తర్వాత ఇద్దరి వివరాలను పరిశీలించిన కోర్టు 12వ వార్డు సభ్యుడు కృష్ణారెడ్డి సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తీర్పును ప్రకటించింది. దీంతో పంచాయతీ ఎన్నికల్లో రెండోస్థానంలో నామినేషన్ సమర్పించిన నారాయణస్వామి (మొదలియార్)ను సభ్యుడిగా ప్రకటిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. దొమ్మసంద్ర గ్రామపంచాయతీ కార్యాలయానికి కోర్టు తీర్పును సోమవారం అందజేశారు. దీంతో నారాయణస్వామికి పదవి దక్కినట్లయ్యింది. అయితే ఇంత పోరాటం చేసినా దక్కింది ఆరు నెలల పదవేనా అంటూ పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నారాయణస్వామిని పలువురు సభ్యులు, గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు. సభ్యులు జయదేవ్, ఆరతిగౌడ, పునీతమ్మ, సురేశ్‌రెడ్డి, వికాస్‌రెడ్డి, ధనలక్ష్మి, గోవిందరాజ్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చిత్రావతి డ్యాం పేరు మార్పుపై నిరసన

బాగేపల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): చిత్రావతి డ్యాంకు మాజీ సీఎం ఎస్‌ఎం కృష్ణ పేరు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ చిత్రావతి పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం చలో చిక్కబళ్లాపుర నిర్వహించారు. డ్యాంకు చిత్రావతి పేరును కొనసాగించాలని లేదా మాజీ ఎమ్మెల్యే శ్రీరామరెడ్డి పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. పోరాట సమితి ఆధ్వర్యంలో గూళూరు సర్కిల్ నుంచి చిక్కబళ్లాపురకు బైక్‌ర్యాలీ బయల్దేరింది. ఈ సందర్భంగా బస్టాండ్‌లోని జీవీ శ్రీరామరెడ్డి విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ముని వెంకటప్ప మాట్లాడుతూ దశాబ్దాలపాటు పోరాటం చేసి డ్యాంను సాధించింది మాజీ ఎమ్మెల్యే శ్రీరామరెడ్డి అన్నారు. ఆయన సేవలను విస్మరించి మరొకరి పేరు పెడితే సహించబోమన్నారు. ఎమ్మెల్యే సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్‌లు తమ రాజకీయ ఉద్దేశ్యాల కోసం జీవీ శ్రీరామరెడ్డి గౌరవానికి భంగం కలిగేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఇలాంటి రాజకీయ కుట్రలు కొనసాగనివ్వమన్నారు. నిరసనలో పోరాట సమితి ముఖ్యులు డీటీ మునిస్వామి, ముస్తాఫ, శ్రీనివాస, చన్నరాయప్ప, రామకృష్ణప్ప, కృష్ణటప్ప రఘురామరెడ్డి పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న పోరాట సమితి సభ్యులు



గజరాజులకు స్వాగతం పలుకుతున్న మంత్రి ఈశ్వర్ ఖండ్రె తదితరులు 7

గజ స్వాగతం

- రాచనగరికి బయల్దేరిన గజరాజులు
- స్వాగతించిన మంత్రి ఖండ్రె, అటవీ అధికారులు



వరమహాలక్ష్మి విగ్రహాన్ని కొనుగోలు చేస్తున్న మహిళ 7

మార్కెట్‌కు లక్ష్మీ కళ

- వరమహాలక్ష్మి వ్రతానికి కొనుగోళ్ల సందడి



బళ్లారి కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న జేడీఎస్ నాయకులు 8

యూరియా కొరతపై జేడీఎస్ నిరసన

- అన్నదాత కష్టాలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆగ్రహం

అమ్మా.. అమ్మా..



అఫ్రీన్ భాను మృతదేహం

హిందూపురం, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు భరించలేక స్థానిక ఆటోనగర్‌కు చెందిన అఫ్రీన్ భాను(22) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. ఆమె తొమ్మిది నెలల చిన్నారి అల్మాస్ విలపించడం కంటతడి పెట్టించింది. టూటౌన్ ఎస్‌ఐ బ్రహ్మానందరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆటోనగర్‌కు చెందిన అఫ్రీన్‌భానును రెండేళ్ల క్రితం అదే ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ అమీర్‌ఖాన్‌కు ఇచ్చి వివాహం చేశారు. కొన్నాళ్లపాటు వీరి దాంపత్య జీవితం సజావుగా సాగింది. ఆ తరువాత భర్త వేధించడం మొదలెట్టాడు. అతడు అనుమానం పెంచుకున్నాడు. దీంతో మనస్తాపం చెందిన అఫ్రీన్ భాను సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని, మరణించింది. కాసేపటికి గుర్తించిన కుటుంబ సభ్యులు.. పోలీసులు, బంధువులకు సమాచారం ఇచ్చారు. టూటౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అఫ్రీన్‌భాను తల్లి షేక్ షాజియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.



కుమార్తె అల్మాస్

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ధర్మవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి)): పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో ఈనెల 18,19 తేదీల్లో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ హర్షవర్ధన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022-25 మధ్య డిగ్రీ, బీటెక్ పూర్తీ చేసిన విద్యార్థుల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని అన్నారు. ఈనెల 11,12,13 తేదీల్లో హైదరాబాద్ నుంచి కంపెనీ ప్రతినిధులు వచ్చి కళాశాలలో ఉచిత శిక్షణ ఇస్తారన్నారు.

పలు మండలాల్లో వర్షం

కొత్తచెరువు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లాలో ఆదివారం రాత్రి పలు మండలాల్లో వర్షం కురిసింది. రొళ్ల మండలంలో 30.4 మి.మీ. అత్యధిక వర్షపాతం నమోదైంది. బత్తలపల్లిలో 24.6 మి.మీ., బుక్కపట్నం 26.2 మి.మీ. వర్షపాతం నమోదయింది. మూడు మండలాల్లో 2.25 మి.మీ., ఒక మండలంలో 5మి.మీ., మరికొన్ని మండలాల్లో తేలికపాటి వర్షం కురిసిందని కొత్తచెరువు ఏఎస్‌ఓ గంగాధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గుంతకల్లు మీదుగా వెలంకనికి ప్రత్యేక రైలు

గుంతకల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని నాగపట్టణంలో వెలసిన వెలంకని ఆరోగ్య మాత ఉత్సవాలను పురస్కరించుకుని గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాంద్రా టెర్మినస్-వెలంకని ప్రత్యేక రైలు (09093) ఈ నెల 27, సెప్టెంబరు ఆరో తేదీల్లో రాత్రి 9-40 గంటలకు బాంద్రా టెర్మినస్‌లో బయలుదేరి రెండో రోజు ఉదయం 7-40 గంటలకు వెలంకనికి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (09094) వెలంకనిలో ఈ నెల 30, సెప్టెంబరు 9 తేదీల్లో అర్ధరాత్రి 12-30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం పదిన్నరకు బాంద్రా టెర్మినస్‌కు చేరుకుటుందన్నారు. ఈ ప్రత్యేక రైలు బోరివాలి, వసాయ్ రోడ్, పన్వేల్, లోనావాలా, పూనా, దౌండ్, షోలాపూర్, కలబురగి, వాడి, యాద్గిర్, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్, ఆ దోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, కాట్పాడి, వెల్లూర్ కంటోన్మెంటు, తిరువన్నమలై, విల్లుపురం, మయిలదుతురై స్టేషన్ల మీదుగా నాగపట్నం చేరుకుంటుందన్నారు.

వేధింపుల ఉపాధ్యాయుడిపై వేటు?

అనంతపురం విద్య, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): విద్యార్థిని పట్ల అసభ్యంగా వ్యవహరించిన టీచర్ వేమనారాయణపై సస్పెన్షన్ వేటుపడినట్లు తెలిసింది. విద్యాశాఖ అధికారులు చెబుతున్న వివరాలిలా ఉన్నాయి. బ్రహ్మసముద్రం మండలం గుండెగానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేమనారాయణ తెలుగు టీచర్‌గా పనిచేస్తున్నాడు. అదే పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. విద్యార్థిని.. తల్లిదండ్రులకు విషయం తెలిపింది. దీంతో వారు.. గ్రామస్థులతో కలిసి మూడురోజుల క్రితం పాఠశాలకు వెళ్లి ఆ టీచర్‌ను తీవ్రంగా మందలించడంతోపాటు హెచ్‌ఎంకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం.. జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో సైతం వైరల్ అయింది. రాష్ట్ర, జిల్లాస్థాయి ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. ఆ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు సోమవారం టీచర్ వేమనారాయణను సస్పెండ్ చేస్తూ ఫైల్ సిద్ధం చేశారు. డీఈఓ ప్రసాద్‌బాబు సెలవులో ఉండడంతో ఆయన వచ్చిన తర్వాత ఆమోదం తీసుకుని, ఉత్తర్వులు ఇస్తారా.. కలెక్టర్‌కు ఫైల్ పెట్టి అక్కడ ఆమోదం వేయించుకుని జారీ చేస్తారా అనేది తేలాల్సి ఉంది. మొత్తం మీద విద్యార్థినిని వేధించిన టీచర్‌పై వేటు పడింది. ఇది విద్యాశాఖ, ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మగ్గానికి కరెంటు ఫ్రీ



చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు ఉచితం

హామీని నిలబెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం
ఈనెల 1వతేదీ నుంచే అమలు
7న ప్రకటించనున్న సీఎం చంద్రబాబు
నేతన్నల హర్షాతిరేకాలు

ధర్మవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నేతన్నలకు ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసింది. అంధకారంలో ఉన్న మగ్గాలకు వెలుగులు పంచాలని నిర్ణయించింది. ఉచిత విద్యుత్ పథకానికి శ్రీకారం చుట్టింది. దీనిని జాతీయ చేనేత దినోత్సవం రోజు(ఈనెల 7న) ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారికంగా ప్రకటించనున్నారు. అంతకుముందే ఈనెల 1వ తేదీ నుంచే ఉచిత విద్యుత్‌ను వర్తింపజేయనున్నారు. పవర్ లూమ్స్‌కు 500 యూనిట్లు, చేనేత కార్మికులకు 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా ఇస్తామని సీఎం చంద్రబాబు ఇటీవల మంత్రివర్గ సమావేశంలో ప్రకటించారు. ఆ మేరకు ఉచిత విద్యుత్‌పై ఆమోద ముద్ర వేసిన విషయం తెలిసిందే. దీంతో జిల్లాలోని చేనేత కార్మికుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

వైసీపీ పాలనలో నిర్లక్ష్యం

గత వైసీపీ ప్రభుత్వం.. చేనేత కార్మికులకు రూ.24 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంది. మిగతా ఎలాంటి ప్రోత్సాహకాలూ ఇవ్వలేదు. ఫలితంగా రంగులు, రసాయనాలు, జరీ ధరలు విపరీతంగా పెరిగాయి. మగ్గం గిట్టుబాటుకాక ఉత్పత్తి తగ్గించడంతో కార్మికులకు పనిలేక రోడ్డున పడ్డారు. అప్పులతో కాలం వెళ్లదీశారు. కొందరైతే మగ్గాన్ని వీడి కూలి పనులకు వెళ్లారు. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ముందు యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేశ్.. ధర్మవరంలో చేనేత కార్మికులతో సమావేశమయ్యారు. నేతన్నల అభ్యర్థన మేరకు ఉచిత విద్యుత్‌పై హామీ ఇచ్చారు. తాజాగా అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు నేతన్నల ఇళ్లకు ఉచితంగా 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్లు విద్యుత్ అందించనున్నట్లు ప్రకటించారు. జిల్లాలో 20 నుంచి 25వేల వరకు మగ్గాలున్నాయి. 30 వేల నుంచి 35వేల వరకు కార్మికులు ఉన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కుటుంబాలకు ఈనెల 7వ తేదీన ఉచిత విద్యుత్ అందించాలని ముందుగా నిర్ణయించినా సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు వారం రోజుల ముందు అంటే ఈనెల 1 నుంచే పథకాన్ని అమలు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నేతన్నలకు నెలకు 100 యూనిట్లు విద్యుత్ మాత్రమే ఉచితంగా ఇచ్చింది. ప్రస్తుతం 200 యూనిట్ల వరకు ఉచితంగా ఇస్తుండడంతో ప్రతి కుటుంబానికి నెలకు రూ.700 నుంచి రూ.1200 వరకు లబ్ధి చేకూరనుందని విద్యుత్ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అంతకుమించి వాడిన దానికి బిల్లు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ధర్మవరం, ముదిరెడ్డిపల్లి, సోమందేపల్లి, గోరంట్ల, హిందూపురం ప్రాంతాల్లో చేనేత కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే చేనేత కుటుంబాల వివరాలను సేకరిస్తున్న జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారులు త్వరలోనే అర్హులకు ఉచిత విద్యుత్ వర్తింపజేసేలా చర్యలు చేపడుతున్నారు.



మగ్గం నేస్తున్న కార్మికుడు



ఆర్థిక భారం తగ్గుతుంది

20 ఏళ్లుగా మగ్గం నేస్తున్నా. గతంలో 100 యూనిట్లు మాత్రమే ఉచితంగా ఇచ్చేవారు. అది మగ్గానికి సరిపోయేది కాదు. అదనంగా బిల్లు చెల్లించాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం నెలకు 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వనుండడంతో ఆర్థిక భారం తగ్గనుంది.

-రామాంజి, చేనేత కార్మికుడు, హమాలీకాలనీ, ధర్మవరం

నేతన్నల వివరాలు ప్రభుత్వానికి పంపాం

నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకాన్ని సీఎం చంద్రబాబునాయుడు ఈనెల 7వతేదీ ప్రకటిస్తారు. ఈనెల 1వ తేదీ నుంచే అమల్లోకి వస్తుంది. 7వతేదీ తరువాత ఉచిత విద్యుత్‌కు ఎవరెవరు అర్హులో తేలనుంది. జిల్లాలో చేనేత కార్మికుల సంఖ్య, విద్యుత్ కనెక్షన్లు తదితర వివరాలు సేకరించి ప్రభుత్వానికి పంపాం.

-రామకృష్ణ, చేనేత జౌళిశాఖ ఏడీ, శ్రీసత్యసాయి జిల్లా

పులకించని మది పులకించె..!

శింగనమల/ధర్మవరం రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ నుంచి రబీ దాకా..! దుక్కి నుంచి పంట అమ్మేదాకా..! ఎప్పుడూ ఏదో ఒక కష్టం..! ఏది ముట్టుకున్నా నష్టం..! ఎప్పుడోగానీ రైతు ముఖం విచ్చుకోదు. నిత్యం ఆలోచనలు, ఆవేదనలతో నిండి ఉండే మట్టి మనిషి ముఖం విప్పారింది. దీనికి కారణం.. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం. అన్నదాత సుఖీభవ తొలివిడ సాయం అందించడం. అదే సమయంలో పీఎం కిసాన్ కింద మరింత సాయం అందడం. కష్టకాలంలో నాలుగు డబ్బులు చేతిలోపడగానే రైతుల ముఖాలు ఆనందంతో వికసించాయి. 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' పథకాల సొమ్మును డ్రా చేసుకునేందుకు వచ్చిన రైతులతో బ్యాంకులలో సోమవారం సందడి నెలకొంది. శనివారం ఆలస్యం కావడం, ఆదివారం సెలవు కావడంతో డబ్బులు డ్రా చేయలేకపోయారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం బ్యాంకులకు క్యూ కట్టారు. ఖరీఫ్ సీజన్ ఆరంభమయ్యాక అన్నదాత సుఖీభవ సొమ్ము కోసం రైతులు ఎదురుచూశారు. విత్తనం, ఎరువులు, కూలీల ఖర్చులకు డబ్బులు అవసరం కావడంతో కొందరు అప్పు చేశారు. తాజాగా ప్రభుత్వం ఇచ్చిన సొమ్ముతో కొందరు చేసిన అప్పులను తీరుస్తున్నారు.

ఎక్కడెక్కడ ఎంత..?

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా అనంతపురం జిల్లాలోని 31 మండలాల పరిధిలో 2,75,642 మంది రైతులకు తొలివిడత రూ.192.94 కోట్లు జమ అయింది. ఇందులో అన్నదాత సుఖీభవ కింద రూ.137.82 కోట్లు, పీఎం కిసాన్ ద్వారా రూ.55.12 కోట్లు వచ్చింది. శ్రీసత్యసాయి జిల్లాలోని 32 మండలాల పరిధిలో 2,65,040 మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.132.52 కోట్లు జమ అయింది.



అన్నదాత సుఖీభవ సొమ్ముకోసం శింగనమల కెనరా బ్యాంకుకు వచ్చిన రైతులు





డ్రా చేసుకున్న డబ్బును చూపుతున్న శింగనమల మండల రైతులు



రైతులకు వరం..

అన్నదాత సుఖీభవ పథకం మాకు వరం. పంటల సాగుకు పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. విత్తనాలు, ఎరువులు, సేద్యపు పనులకు అప్పులు చేయాల్సి వస్తోంది. ఇలాంటి సమయంలో ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రూ.7 వేలు ఇచ్చింది. ఈ కష్టకాలంలో మాకు ఊరట లభిస్తోంది.

- నరసింహారెడ్డి, తుమ్మల, ధర్మవరం మండలం

కూలీల ఖర్చుకు వస్తాయి..

అన్నదాత సుఖీభవ పేరిట సాయం అందించి, చంద్రబాబు రైతు పక్షపాతి అని నిరూపించుకున్నారు. పంటలు పెట్టాలంటే కూలీలకు, మందులకు విపరీతంగా ఖర్చులు వస్తున్నాయి. ప్రభుత్వం ఏడాదికి రూ.20 వేలు ఇవ్వడం, మొదటి విడద కింద రూ.7 వేలు జమచేయడం సంతోషానిచ్చింది. కూలీల ఖర్చు భయం లేకుండా పోయింది. లేదంటే కూలీలకు ఇచ్చేందుకు అప్పు చేసేవాళ్లం. రైతులకు సీఎం మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకురావాలి.

-గుత్తా సూర్యనారాయణ, ఏలుకుంట్ల, ధర్మవరం మండలం



పెట్టుబడులకు ఉపయోగం..

వ్యవసాయ పెట్టుబడులకు అన్నదాత సుఖీభవ నగదు ఉపయోగపడుతుంది. ప్రతి సంవత్సరం పంటలు సాగుచేసే సమయానికి అప్పులు చేస్తున్నాం. ఇప్పుడు ప్రభుత్వం నగదు విడుదల చేసింది. పెట్టుబడులకు ఎంతోగానో ఉపయోగపడుతుంది. నా బ్యాంకు ఖాతాలో రూ.7 వేలు జమ అయింది. ఎంతో సంతోషంగా ఉంది.

-నరసింహుడు, సంజీవపురం, బత్తలపల్లి



సరైన సమయంలో..

ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ డబ్బులు ఇచ్చారు. అన్నదాత కష్టాలు తెలిసిన నాయకుడు ఆయన. మమ్మల్ని ఆదుకునేందుకు సరైన సమయంలో డబ్బులు విడుదల చేశారు. పంటల పెట్టుబడులకు ఈ సొమ్మును వాడుకుంటాం. బ్యాంకు ఖాతాలో సొమ్ము పడిందని తెలియగానే మా రైతులంతా ఎంతో సంతోషంగా కనిపిస్తున్నారు. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు.

-పెద్దినేని వెంకటాద్రి, రైతు, నల్లచెర్లోపల్లి, ముదిగుబ్బ మండలం



ప్రభుత్వంతో జేఎన్‌టీయూ ఎంఓయూ



మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకుంటున్న జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ క్రిష్ణయ్య తదితరులు

అనంతపురం రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ, రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు వర్సిటీ వీసీ ఆచార్య సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఆచార్య క్రిష్ణయ్య తెలిపారు. విజయవాడలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో ప్రభుత్వ కార్యదర్శి గిరిబాబు, అడిషనల్ సెక్రటరీ ఫర్ లేబర్ గంధం చంద్రుడు లతో జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, డీఏపీ ఆచార్య సత్యనారాయణ సోమవారం సమావేశమై ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. యూనివర్సిటీలో ఉన్న కెమికల్, మెకానికల్, ఎలక్ట్రానికల్ ఫ్యాకల్టీ ఎక్స్‌పర్ట్‌లను ఉపయోగించుకుని పరిశ్రమల్లో సేఫ్టీ ప్రోగామ్స్‌ను మానిటరింగ్ చేస్తారన్నారు. టెక్నికల్ నాలెడ్జ్‌లను, పరిశోధనలకు సంబంధించిన సేఫ్టీ ఎక్విప్‌మెంట్‌ను వాడుకుంటారన్నారు. సేఫ్టీ ఆడిట్ రిపోర్టును పరీక్షించడం, అధ్యయనం చేయడం, దానికి కావలసిన చేర్పులు, మార్పులు చేయడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందన్నారు. దీని వల్ల డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వాళ్ల కావలసిన రీసెర్చ్, ఎక్విప్‌మెంట్‌కు ఆర్థిక సాయం చేస్తారని తెలిపారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఇప్పిస్తారన్నారు. కార్యక్రమంలో డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మోహన్‌రావు, ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

అనంతపురం వైద్యం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మల్టీపర్పస్ హెల్త్ వర్కర్(ఏఎన్‌ఎం) కోర్సుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఏఎన్‌ఎం శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ యశోదమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కోర్సుకు మహిళలు మాత్రమే అర్హులన్నారు. అభ్యర్థులు ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ వెబ్‌సైట్ https://cfw.ap.nic.in/ ద్వారా దరఖాస్తుల చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9491939451, 9446941113 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

పుట్టపర్తిలో భారీ వర్షం



పుట్టపర్తిలో రహదారిపై పారుతున్న వర్షపు నీరు

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రం పుట్టపర్తిలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గతకొంతకాలంతో ఊరిస్తూ ఉసూరుమనిపిస్తున్న మేఘాలు సోమవారం రాత్రి భారీ వర్షం కురిపించాయి. దీంతో పట్టణంలోని రహదారులన్నీ మోకాలులోతు నీటితో జలమయమయ్యాయి. అలాగే హిందూపురం, గుడిబండ, కొత్తచెరువు, పెనుకొండ, గోరంట్లలలో ఓమోస్తరు వర్షం కురిసింది.

8 మంది మట్కా బీటర్ల అరెస్టు

అనంతపురం క్రైం,ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ఎనిమిది మంది మట్కా బీటర్లు, నిర్వాహకులను అరెస్టు చేసినట్టు టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. సోమవారం సీఐ శ్రీకాంత్ యాదవ్, ఎస్ఐ రుషేంద్రబాబు.. నిందితుల వివరాలను టూటౌన్‌లో ప్రకటించారు. మట్కా సమాచారం రావడంతో సాయినగర్ 2వ క్రాస్‌లో తనిఖీలు చేశామన్నారు. ఈ సందర్భంగా మట్కా నిర్వహిస్తున్న వారిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి నగదు రూ.1.50 లక్షలు, మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

తల్లిపాలు బిడ్డ హక్కు

జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తల్లి పాలు బిడ్డ హక్కు అని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ తల్లిపాల వారోత్స వాలు-2025ను ఘనంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో ఈనెల 1 నుంచి ఏడో తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించాలన్నారు. తల్లి పాలు బిడ్డకు తొలి టీకా అన్నారు. జీవితానికి కవచం- ఆరోగ్య భవితకు బలమైన పునాది అని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్‌ఓ మలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఐసీడీఎస్ పీడీ నాగమణి, వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీలు నిర్వహించాలి

పతి నెలా ఐదో తేదీన అన్ని సచివాలయాల పరిధిలో వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీలను నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూభవన్‌లో పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో జీఏపీ, మన మిత్ర-ప్రజలచేతిలో ప్రభుత్వం అనే పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్‌ను తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఒక నెంబర్‌ద్వారా 200కు పైగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. 9552300009 నంబర్‌పై అవగాహన కల్పించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీలలో వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు పాల్గొని అవగాహన కల్పించాలన్నారు.

7న ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

పుట్టపర్తి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సత్యసాయి విద్యాసంస్థల పూర్వ విద్యార్థులు నిర్వహిస్తున్న శ్రీసత్యసాయి పాలియేటివ్ కేర్ సెంటర్‌లో ఈనెల 7న క్యాన్సర్ ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పెద్దకమ్మవారిపల్లి రోడ్డులో గల ఆస్పత్రిలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలను 35 సంవత్సరాలు దాటిన మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందస్తుగా 8047103700 నంబరుకు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని వారు కోరారు.

9 నుంచి రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్



ఎంపికైన దివ్యాంగ క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పారా జూనియర్, సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు ఈనెల 9 నుంచి ప్రారంభమవుతాయని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు విశాఖపట్నంలోని పోలీస్ బ్యాక్‌గ్రౌండ్‌లో నిర్వహిస్తారన్నారు. జిల్లా నుంచి 40మంది ప్రాతినిథ్యం వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల ఏడున విశాఖపట్నానికి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి విజేతలుగా రావాలని ఆకాంక్షించారు.

టీటీడీసీని సందర్శించిన కేంద్ర బృందం

అనంతపురం అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నగర శివారు పంగల్ రోడ్డు సమీపంలోని టీటీడీసీ శిక్షణాకేంద్రాన్ని కేంద్ర పథకాల పర్యవేక్షణ బృందం అధికారులు సాంబశివరావు, నవ్య సందర్శించారు. సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన కమిటీ సభ్యులు తొలిరోజు టీటీడీసీ శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలు.. తద్వారా సాధించిన ఫలితాలపై ఆరాతీశారు. అనంతరం ఎస్కేయూ సమీపంలోని రూడ్ సెట్ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ నిర్వహించే ఉచిత శిక్షణలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 13వ తేదీదాకా జిల్లాలోని పలు ప్రాంతాల్లో కమిటీ సభ్యులు పర్యటించనున్నారు. ఆయా గ్రామాల్లో పలు రకాల పనులను పరిశీలిస్తారు. మంగళవారం గుంతకల్లు మండలం దోసలుడికి, ఈనెల 6న కొంగనపల్లి, 7న నాగసముద్రం, 8న పుట్లూరు మండలం అరకటివేముల, 9న మడ్డిపల్లి, 10న మడుగుపల్లి, 11న విడపనకల్లు మండలం పాల్తూరు, 12న జనార్దనపల్లి, 13న కలెక్టరేట్‌లో సంబంధితశాఖల అధికారులతో సమావేశమవుతారు.


కేంద్ర బృందానికి సహకరించండి..

జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను పర్యవేక్షించేందుకు వచ్చిన జాతీయస్థాయి మానిటరింగ్ బృందానికి సహకారం అందించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ.. అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన నేషనల్ లెవల్ మానిటరింగ్ బృందం, డ్వామా, సంబంధిత శా ఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమవారం నుంచి ఈనెల 13 వరకు నేషనల్ లెవల్ మానిటర్ టీం జిల్లాలో పర్యటిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధిదారులతో మాట్లాడి విజయగాథల వివరాలను వారికి తెలపాలన్నారు. సమావేశంలో కేంద్ర బృందం అధికారులు సాంబశివరావు, నవ్య, డ్వామా పీడీ సలీం బాషా, జడ్పీ సీఈఓ శివశంకర్, డీపీఓ నాగరాజు నాయుడు, హౌసింగ్ పీడీ శైలజ, డీఆర్‌డీఏ ఏపీడీలు గంగాధర్, సత్యనారాయణ, సర్వే ఏడీ రూప్లానాయక్ పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

బెజవాడ గోపాలరెడ్డి (జయంతి)



స్వాతంత్ర్య సమరయోధుడు, బహుభాషావేత్త డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి 1907 ఆగస్టు 5న నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జన్మించారు. జాతీయోద్యమంలో జైలుశిక్ష అనుభవించారు. మద్రాస్ ప్రెసిడెన్సీలో 1955 నుంచి 1956 వరకు ఆంధ్రరాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. 1967 నుంచి 1972 వరకు ఉత్తరప్రదేశ్‌కు గవర్నర్‌గా వ్యవహరించారు. కేంద్ర, రాష్ట్రాల్లో మంత్రి పదవుల్లో కొనసాగారు. తెలుగు భాషా సమితి అధ్యక్షులుగా సాహిత్యాన్ని ప్రోత్సహించారు. గీతాంజలి వంటి రచనలను తెలుగులోకి అనువాదం చేసి ఆంధ్ర ఠాగూర్‌గా పేరొందారు. 1997 మార్చి 9న కన్నుమూశారు.

ఆలూరు వెంకటసుబ్బారావు (జయంతి)



కలంపేరు 'చక్రపాణి'గా పేరొందిన ఆలూరు వెంకట సుబ్బారావు 1908 ఆగస్టు 5న గుంటూరు జిల్లా తెనాలిలో జన్మించారు. బహుభాషావేత్త, తెలుగు రచయిత, పత్రికా సంపాదకుడు, సినీ నిర్మాత, దర్శకుడు, ప్రత్యేకించి చందమామ - విజయా కంబైన్స్ నిర్మాణ సంస్థను స్థాపించినవారిలో ఒకరు. పాతాళ భైరవి, మాయాబజార్, గుండమ్మ కథ, మిస్సమ్మ, షావుకారు, అప్పు చేసి పప్పుకూడు, 'స్వర్గసీమ' సినిమాలతో ఎంతో పేరొందారు. 1975 సెప్టెంబరు 24న కన్నుమూశారు.

నీల్ అల్డెన్ ఆర్మ్‌స్ట్రాంగ్ (జయంతి)



చంద్రుడిపై నడిచిన తొలి వ్యక్తిగా గుర్తింపు పొందిన నీల్ అల్డెన్ ఆర్మ్‌స్ట్రాంగ్ 1930 ఆగస్టు 5న జన్మించారు. అమెరికా దేశానికి చెందిన ఆయన వ్యోమగామిగా, ఏరోనాటికల్ ఇంజనీర్‌గా రాణించారు. నావల్ ఏవియేటర్, టెస్ట్ పైలట్, యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా వ్యవహరించారు. 1962లో నాసా ఆస్ట్రోనాట్ కార్ప్స్‌లో చేరారు. 'మానవత్వం వైపు వేసే ప్రతి అడుగు ఎంతో గొప్పదనే' ఆయన వ్యాఖ్యలు ఎంతో ప్రభావితం చేశాయి. ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడం, కాంగ్రెషనల్ గోల్డ్ మెడల్ తదితర అవార్డులు అందుకున్నారు. 2012 ఆగస్టు 25న కన్నుమూశారు.

కాజల్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత కాజల్ 1974 ఆగస్టు 5న ముంబైలో జన్మించారు. హిందీ సినీరంగంలో అత్యధిక రెమ్యూనరేషన్ అందుకుంటున్న నటీమణులలో ఒకరు. ఆరు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. ఆమె సాధనలకు గాను మేడమ్ టస్సాడ్ మ్యూజియంలో మైనపు బొమ్మ ఏర్పాటు చేశారు. చిన్నారులు, వితంతుల సంక్షేమం, సమాజసేవలోనూ రాణిస్తున్నారు. నటుడు అజయ్ దేవగన్‌ను పెళ్ళాడారు.

నేటి నుంచి ఐపీఓలోకి ఎన్‌ఆర్‌టీ

బెంగళూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నాలెడ్జ్ రియాలిటీ ట్రస్టు (ఎన్‌ఆర్‌టీ) రూ.4,800 కోట్ల లక్ష్యంతో పబ్లిక్ఇష్యూను మంగళవారం నుంచి అమలులోకి వస్తున్నట్టు ప్రకటించారు. ఒక యూనిట్ 95-100 రూపాయలదాకా నిర్ణయించామని, ఈనెల 7న గురువారంతో బిడ్ ముగియనుందని సత్వ గ్రూప్ ఎండీ బిజయ్ అగర్వాల్ ప్రకటించారు. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్లాక్‌స్టోన్ సీనియర్ ఫౌండర్ డైరెక్టర్ అశిష్‌మెహతా మాట్లాడుతూ సత్వతో సుదీర్ఘకాల భాగస్వామిగా ఎన్‌ఆర్‌టిని ప్రారంభించేందుకు సంతోషంగా ఉందన్నారు. దేశంలో అతిపెద్ద ఆఫీస్ నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు.

బన్నేరుఘట్ట రోడ్డులో రామ్‌రాజ్ శాఖ

బొమ్మనహళ్ళి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బన్నేరుఘట్ట రోడ్డు అరికెరె సిగ్నల్‌లో రామ్‌రాజ్ షోరూంను ఏర్పాటు చేసింది. కాటన్ దుస్తులలో పేరొందిన రామ్‌రాజ్ సంస్థ క్రమేపీ తనశాఖలను విస్తరించుకుంటోంది. వరమహాలక్ష్మి పండుగకు సిల్క్‌చీరలతోపాటు ప్రస్తుత పండుగల సీజన్‌లో ప్రజలకు అవసరమైన అన్ని రకాల దుస్తులను అందుబాటులో ఉంచినట్టు మేనేజర్ సచిన్ తెలిపారు. కర్ణాటకలో 70వ షోరూంగా తెలిపారు. పిల్లలు, పెద్దలకు వీలుగా దుస్తులు ఉన్నాయన్నారు.

కాంగ్రెస్ నిరసన 8కి వాయిదా

శిడ్లఘట్ట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బెంగళూరులో మంగళవారం చేపట్టదలిచిన భారీ నిరసన 8కి వాయిదా పడిందని కేపీసీసీ కన్వీనర్ రాజీవ్‌గౌడ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాటాడుతూ జార్ఖండ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శిబు సొరెన్ మృతి నేపథ్యంలో కార్యక్రమాన్ని వాయిదా వేసినట్టు తెలిపారు. ఇందుకు కార్యకర్తలు, ప్రజలు సహకరించాలని కోరారు.

ఫయాజ్ బెయిల్ పిటిషన్ తిరస్కరణ

బెంగళూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): హుబ్బళ్ళిలో విద్యార్థి నేహా హిరేమఠ్‌ను కళాశాలలో కత్తితో పొడిచి చంపిన కేసులో నిందితుడు ఫయాజ్‌కు సంబంధించిన బెయిల్ పిటీషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. హుబ్బళ్ళి ఒకటవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు బెయిల్ పిటీషన్‌ను న్యాయవాదికారి పల్లవి బీఆర్ తిస్కరిస్తూ సోమవారం ఆదేశించారు. ఫయాజ్ తరఫున జెడ్‌ఎం హత్తరకి వాదనలు వినిపించారు. కేసు విచారణలు ఎప్పటినుంచి జరపాలనేది ఈనెల 6న సూచిస్తామని న్యాయస్థానం ప్రకటించింది. కాగా ఫయాజ్‌కు బెయిల్ మంజూరైతే పోరాటం చేస్తామని శ్రీరామసేన ఆందోళనకు సిద్ధమైంది. బెయిల్ తిరస్కరణ ఆదేశాలు వెల్లడి కావడంతో శ్రీరామసేన సంబరాలు చేసుకున్నారు.

అలరించిన నాట్య ప్రదర్శన

పుట్టపర్తి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బాలవికాస్ చిన్నారులు చేపట్టిన సంగీత సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. హరియాణా, చండీఘర్ భక్తులు పర్తి యాత్రపేరిట సోమవారం ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంతు సభామండపంలో బాలవికాస్ చిన్నారులు కరిస్పియేవచనం సేవ పేరిట నాటికను ప్రదర్శించారు. నాటికలోని పాత్రధారులు తమ నటనతో భక్తులకు ఆహ్లాదం కలిగించారు.

ఆర్టీసీ సమ్మెకు హైకోర్టు ఒకరోజు బ్రేక్

బెంగళూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులు పలు డిమాండ్లతో సోమవారం అర్ధరాత్రి నుంచి తలపెట్టిన సమ్మెను ఒకరోజు వాయిదా వేసుకోవాలని హైకోర్టు ధర్మాసనం సూచించింది. ఆర్టీసీ ఉద్యోగులు 20రోజులక్రితం ప్రభుత్వానికి నోటీసు ఇచ్చారు. అయితే వారి డిమాండ్లు పరిష్కరించేదిశగా పలుమార్లు రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డితో చర్చలు సాగాయి. తాజాగా సోమవారం సీఎం సిద్దరామయ్య ఆర్టీసీ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చ జరిపారు. 38 నెలల అరియర్స్ ఇవ్వలేమని సీఎం సిద్దరామయ్య తేల్చిచెప్పారు. మిగిలిన అన్ని సమస్యలు చర్చించేందుకు సిద్ధమని హామీ ఇచ్చారు. అయితే ఉద్యోగులు అంగీకరించలేదు. దీంతో నాలుగు కార్పొరేషన్‌లకు సంబంధించి 23వేల బస్సులు నిలిచిపోయే అవకాశం ఏర్పడింది. మరోవైపు ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె చేయరాదని, ఎస్మా ప్రయోగించారు. ఈ ఏడాది ఆఖరుదాకా ఎస్మా అమలులో ఉంటుందని తేల్చి చెప్పారు. బెంగళూరుకు చెందిన జె సునిల్‌తోపాటు పలువురు ఆర్టీసీ సమ్మెపై హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. విచారణ జరిపిన ధర్మాసనం సమగ్ర వాదనలకు సమయం అవసరంగా కోరింది. మంగళవారం ఒకరోజు సమ్మె వాయిదా వేయాలని హైకోర్టు ధర్మాసనం సూచించింది. దీంతో మంగళవారం బస్సులు యథావిధిగా సంచరించనున్నాయి.



ముఖ్యమంత్రితో చర్చలు జరుపుతున్న యూనియన్ నాయకులు



గజరాజులను స్వాగతిస్తున్న అటవీ సిబ్బంది, ప్రజలు



మావటీలను సత్కరిస్తున్న మంత్రి ఖండ్రె

గజ స్వాగతం

బెంగళూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మక నాడహబ్బ దసరా ఉత్సవాలలో పాల్గొనే గజరాజులకు సాదరంగా స్వాగతించారు. సోమవారం నాగరహొళె పులుల సంరక్షణా కేంద్రం సమీపాన వీరనహొసహళ్ళినుంచి ఏనుగులు మైసూరుకు బయల్దేరాయి. కేప్టెన్ అభిమన్యు నేతృత్వంలో 9 ఏనుగులకు అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె, పశుసంవర్ధకశాఖ మంత్రి వెంకటేశ్‌లు సంప్రదాయబద్ధంగా పూజలు చేసి పుష్పార్చన జరిపి స్వాగతించారు. జానపద కళాబృందాలతోపాటు మహిళలు కళశాలతో సంప్రదాయ ప్రయాణానికి స్వాగతం పలికారు. కేప్టెన్ అభిమన్యుతోపాటు ధనంజయ, బీమ, మహేంద్ర, కావేరి, కంజన్, ప్రశాంత, లక్ష్మి, ఏకలవ్య ఏనుగులకు పాదపూజ చేశారు. కుడుములతోపాటు బెల్లం, చెరుకు, ద్రాక్ష, డ్రైఫ్రూట్స్‌తో సిద్ధం చేసిన నైవేద్యం సమర్పించారు. ఎమ్మెల్యేలు తన్వీర్‌సేట్, హరీశ్‌గౌడ, రవిశంకర్, జిల్లా అధికారి లక్ష్మికాంతరెడ్డి, జడ్పీ సీఈఓ యుకేశ్‌కుమార్, దక్షిణ విభాగం డీఐజీ బోరలింగయ్య, ఎస్పీ విష్ణువర్ధన్, డీసీఎఫ్‌లు ప్రభుగౌడ, సీమా తదితరులు పాల్గొన్నారు.

చరణ్ బ్యాంకుచే విద్యార్థులకు ప్రోత్సాహకాలు

బెంగళూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బసవనగుడిలోని చరణ్ కో-ఆపరేటివ్ బ్యాంకు ఆధ్వర్యంలో ఎస్‌ఎస్‌ఎల్‌సీ, పీయూసీలలో 90శాతంకంటే ఎక్కువమార్కులు సాధించిన సభ్యుల పిల్లలకు ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. ఆదివారం శంకరపురంలో విద్యాశ్రీ విద్యావిహార్ ప్రాంగణంలో బ్యాంకు సంస్థాపక అధ్యక్షులు బీవీ ద్వారకనాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 2.92 కోట్ల రూపాయల లాభం గడించినట్టు తెలిపారు. నిమ్హాన్స్ మాజీ అధికారి, సమాధాన సంస్థ నిర్వాహకులు పద్మశ్రీ గ్రహీత డాక్టర్ సీఆర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ జీవితంలో ఎదగాలంటే మార్కులు, డబ్బు, వస్తువుల వెంట పడరాదన్నారు. పది నిమిషాలు కూర్చుంటే మరో పది నిమిషాలు లేచి నడవాలని అప్పుడే ఆలోచనలో మార్పు వస్తుందన్నారు. సినీ దర్శకులు బీకే శ్రీనివాస్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేసి ఉన్నతవిద్యలోనూ రాణించాలని అభిలషించారు.



ప్రోత్సాహకాలు పొందిన విద్యార్థులతో ప్రముఖులు

మానసిక ఆరోగ్యమూ ముఖ్యమే

» మంత్రి దినేశ్ గుండూరావు



మంత్రి దినేశ్‌గుండూరావు తదితరులు

బెంగళూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సాధారణ ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమేనని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్‌గుండూరావు అభిప్రాయపడ్డారు. ఫణిసంద్రలో అమహా ఆసుపత్రి సూపర్‌స్పెషాలిటీ మానసిక ఆరోగ్య కేంద్రం ప్రారంభించి మాట్లాడుతూ 27 పడకల సామర్థ్యంతో నాణ్యమైన సేవలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఆసుపత్రి సీఈఓ డాక్టర్ అమిత్‌మలిక్ మాట్లాడుతూ గత 9ఏళ్లలో దేశంలో అతిపెద్ద సూపర్ స్పెషాలిటీ మానసిక ఆరోగ్య సేవలు అందిస్తోందన్నారు. లండన్‌లో శిక్షణ పొందిన మానసిక వైద్యులు ఇక్కడ సేవలందిస్తున్నారన్నారు. ఈసందర్భంగా ఆసుపత్రి వైద్యబృందం పాల్గొన్నారు.

కోడిచిక్కనహళ్లిలో ఉచిత కల్యాణమండపం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి దంపతులు

బొమ్మనహళ్ళి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సమాజసేవ ఎంతో తృప్తి ఇస్తోందని ఇందులో భాగంగా బొమ్మనహళ్ళి నియోజకవర్గంలోని కోడిచిక్కనహళ్ళిలోని సొంత స్థలంలో ఉచిత కల్యాణమండపాన్ని ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి తెలిపారు. ప్రజలకు 15ఏళ్లుగా ప్రజాప్రతినిధిగా సేవలందిస్తున్నానన్నారు. ఇటీవలికాలంలో పెళ్లిళ్ల నిర్వహించడం భారంగా మారిందని, కల్యాణమండపం బాడుగ కనీసం అంటే రూ.4-5లక్షలదాకా ఉందన్నారు. పేద వర్గాలకు అనుకూలంగా ఉండాలనే లక్ష్యంతో ఉచిత కల్యాణమండపాన్ని అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. కాగా ఇతర శుభ కార్యక్రమాలకు కూడా వినియోగించవచ్చునన్నారు. రుక్మిణి ప్రభాకరరెడ్డి కల్యాణమండపాన్ని సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. సుమారు 500-600మంది ఆశీనులయ్యేలా ఇక్కడ సదుపాయాలు ఉన్నాయన్నారు. అవసరమైన వారు తమ కార్యాలయంలో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గిరిజకల్యాణోత్సవం, గణపతి హోమం, శాంతిహోమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హొంగసంద్ర శ్రీనివాసరెడ్డి, మాజీ కార్పొరేటర్‌లు భారతి రామచంద్ర, శ్రీనివాసరెడ్డి, మురళి పురుషోత్తం తదితర నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల తరగతి గదులు ప్రారంభం



మంత్రి మునియప్ప తదితరులు

విజయపుర, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని గురప్పనమఠం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు కోటి రూపాయల ఖర్చుతో ఎంబస్సీ సంస్థ సీఎస్‌ఆర్ నిధులకింద నిర్మించింది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కేహెచ్ మునియప్ప తరగతి గదులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాఠశాలలకు ప్రైవేట్ సంస్థలు, ట్రస్టులు చేయూతను అందించి ప్రోత్సహిస్తున్నాయని అభినందించారు. కార్యక్రమంలో ఎంబస్సీ సంస్థ ముఖ్యులు శైన గణపతి, దాత నారాయణ్, ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ, టీచర్లు సోమశేఖర్, జలజాక్షి, కుమారి, మంజుళ, పురసభ అధ్యక్షురాలు భవ్య మహేశ్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి చేయూత

శిడ్లఘట్ట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మళమాచనహళ్ళి గ్రామదేవత ఆలయ అభివృద్ధికి కాంగ్రెస్ నాయకుడు రూ.60వేల విరాళాన్ని అందచేశారు. చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో అవసరమైతే మరింత సాయం చేస్తానన్నారు. గత ఎన్నికల వేళ ఇచ్చిన హామీకి అనుగుణంగా ఆలయానికి విరాళం ఇచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షురాలు సహనా రాజీవ్‌గౌడ, గ్రామపెద్దలు కృష్ణప్ప, గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు రామాంజినప్ప, మాజీ సభ్యుడు అట్టూరు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న రాజీవ్‌గౌడ

టీవీకే మహానాడు తేదీ మార్పు

ప్యారీస్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పోలీసులు అనుమతి నిరాకరించడంతో తమిళగ వెట్రి కళగవ (టీవీకే) రెండో మహానాడు తేదీ మార్పుచేయనున్నట్లు ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ ప్రకటించారు. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఘన విజయం సాధించాలన్న పట్టుదలతో టీవీకే పార్టీ పరంగా 120 జిల్లాల అధ్యక్షుడు, మండల నిర్వాహకులు, పంచాయతీల కార్యదర్శులు నియమించారు. ఈ నేపథ్యంలో, రెండో రాష్ట్రస్థాయి మహానాడును మదురైలో ఈనెల 25న నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభించారు. అయితే 27వ తేదీ వినాయక చవితి కారణంగా మహానాడుకు పోలీస్ బందోబస్తు ఇవ్వడం కష్టమనే కారణంగా మదురై పోలీసులు 25వ తేదీ టీవీకే మహానాడుకు అనుమతి నిరాకరించినట్లు తెలిసింది. అందువల్ల ఈ నెల 18 నుంచి 22లోపు ఏదో ఒక తేదీలో మహానాడు జరుపుకోనున్నట్లు విజయ్ ఓ ప్రకటనలో తెలిపారు.

తమిళనాడు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సూర్యప్రకాష్

ప్యారీస్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సూర్యప్రకాష్ బాధ్యతలు స్వీకరించారు. రాయపేటలోని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై అధ్యక్షతన ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో సూర్యప్రకాష్‌తో ప్రమాణస్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌సీసీ ఇన్‌చార్జి సూరజ్ హెగ్డే, మాజీ ఎంపీలు కృష్ణస్వామి, కేవీ తంగబాలు, ఏఐసీసీ కార్యదర్శులు క్రిస్టోఫర్ తిలక్, ఎంపీ రాబర్ట్‌బ్రూస్, ఎస్సీ విభాగం అధ్యక్షుడు రంజన్‌కుమార్, ప్రకాష్ తదితరులు పాల్గొని సూర్యప్రకాష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

మార్కెట్‌కు లక్ష్మీ కళ



బసవనగుడిలో సిద్ధమైన అలంకార నమూనాలు

బెంగళూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసంలో పండుగల సందడి ప్రారంభమైంది. మరో నాలుగు రోజుల్లో వరమహాలక్ష్మి వ్రతం ప్రజలు జరుపుకోనున్నారు. వ్రతానికి అవసరమైన కొను గోళ్లతో మార్కెట్ కిటకిటలాడుతోంది. వరమహాలక్ష్మిని వివిధ వస్తువులతో రూపొందించడం ఆనవాయితీ. టెంకాయకు ముఖావళి అమర్చి అలంకరిస్తారు. తాజాగా విగ్రహాల రూపంలోనే వరమహాలక్ష్మి బొమ్మలను అలంకరించి పూజలు చేసే ఆనవాయితీ మొదలయ్యింది. వరమహాలక్ష్మి వ్రతం కోసం అవసరమైన వస్తువులు, అలంకరణ సామగ్రితో మార్కెట్ కిటకిటలాడుతోంది. గాంధీబజార్, మాగడిరోడ్డు, జయనగర్, మడివాళ, జేపీ నగర్, యలహంక, కేఆర్‌పురం, మల్లేశ్వరంతోపాటు వివిధ ప్రాంతాల్లో పండుగకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

ఏఐ సాంకేతికతతో 90శాతం రోగ నిర్ధారణ

బెంగళూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఏఐ సాంకేతితతో 90శాతం రోగనిర్ధారణ సాధ్యమని ఐఐటీ ఖరగ్‌పూర్ మాజీ డైరెక్టర్ పార్థ ప్రతీమ్ చక్రబర్తి అభిప్రాయపడ్డారు. అనంతకుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేషన్ ఫస్ట్ డైలాగ్ పేరిట రోగాల నిర్ధారణకు కృత్రిమ మేథస్సు అనే అంశంపై వర్చువల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్థ ప్రతీమ్ మాట్లాడుతూ గుణాత్మకమైన చికిత్సలు అందాలంటే రోగనిర్ధారణ సకాలంలో చేయాలన్నారు. ఏఐ సాంకేతికత అన్ని రంగాలకు ఉపయోగపడనుందన్నారు. ప్రపంచంలో 200 ప్రొటీన్‌ల సమాచారం సాధ్యమన్నారు. క్యాన్సర్ ట్రీట్‌మెంట్ సర్వీస్ ఇంటర్నేషనల్ సంస్థ అధ్యక్షులు దిలీప్ మన్నాలి, ఫౌండేషన్ ముఖ్యులు, అదమ్యచేతన మేనేజింగ్ ట్రస్టీ తేజస్విని అనంతకుమార్, ఫౌండేషన్ అధ్యక్షులు కృష్ణభట్, సమన్వయకర్త సుదీప్‌కుమార్‌లు పాల్గొన్నారు.

కెనరా రోబెకో ఆధ్వర్యంలో నివేశ్ బస్సుయాత్ర



బస్సుయాత్ర ప్రారంభోత్సవంలో ప్రముఖులు

బెంగళూరు, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): మ్యూచువల్‌ఫండ్లపై అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలోని ఐదు నగరాలలో కెనరా బ్యాంకుకు అనుబంధమైన మ్యూచువల్‌ఫండ్ కంపెనీ కెనరా రోబెకో అసెట్ మేనేజిమెంట్ ఆధ్వర్యంలో నివేశ్ బస్సుయాత్ర ప్రారంభించారు. సోమవారం బస్సు యాత్రను కెనరా రోబెకో ఏఎంసీ ఎండీ, సీఈఓ రజనీశ్ నరోలా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నివేశ్ బస్సుయాత్ర ఇప్పటికే కేరళ, పంజాబ్, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాలలో కొనసాగిందన్నారు. రాష్ట్రంలో బెంగళూరు, మైసూరు, బెళగావి, మంగళూరు, హుబ్బళ్ళిలలో బస్సుయాత్ర కొనసాగుతుందన్నారు. 20రోజులపాటు ఐదు నగరాలలోని ప్రముఖ ప్రదేశాలలో ప్రజలలో అవగాహన కల్పిస్తామన్నారు. ఖాతాదారులు పెట్టుబడులను దీర్ఘకాలంలో మదుపు చేసేలా అవగాహన చేయదలిచామన్నారు. మార్కెటింగ్ చీఫ్ గౌరవ్ గోయెల్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

టమోటాకు టైమొచ్చింది..!

● ఏడాది తర్వాత ధరలు ● కిలో రూ.30 నుంచి రూ.44 మధ్య పలుకుతున్న వైనం ● అన్నదాతల్లో ఆనందం



అనంతపురంరూరల్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు టమోటాకు గిట్టుబాటు ధర దక్కుతోంది. ఏడాదిగా ధరల్లేక రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు. కూలి ఖర్చులు కూడా దక్కలేదు. కొంతమంది పంటను చేనులోనే వదిలేశారు. ఇంకొందరు తొలగించి, రోడ్డు పక్కనే పడేశారు. గిట్టుబాటు ధరలు కల్పించాలంటూ అన్నదాతలు రోడ్డెక్కి నినదించారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు టమోటా ధరలు పెరుగుతున్నాయి. దీంతో అన్నదాతకు ఉపశమనం దక్కుతోంది.

పెరుగుతున్న ధరలు..

జిల్లాలో 5,600 హెక్టార్లలో టమోటా ప్రస్తుతం సాగుతో ఉంది. ఇందులో 30 శాతం వరకు కోత దశలో ఉన్నట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. కక్కలపల్లి టమోటా మార్కెట్‌కు రోజూ 3 వేల టన్నులకుపైగా టమోటా ఉత్పత్తులు వస్తున్నాయి. ఇతర ప్రాంత మార్కెట్లలోనూ ఆశించిన స్థాయిలో టమోటా ఉత్పత్తులు లేకపోవడం ఇక్కడ ధరల పెరుగుదలకు కారణం. వారం రోజులుగా ధరలు స్థిరంగా పలుకుతున్నాయి. గరిష్ఠంగా రూ.30 నుంచి రూ.44 మధ్య అమ్ముడుపోతున్నాయి. 15కిలోల బాక్సు రూ.450 నుంచి రూ.660 వరకు పలుకుతోంది. గతంలో మచ్చలున్నవి, గోలీల్లాంటి కాయలను పడేసేవారు. ప్రస్తుతం వాటికి కూడా మంచి ధర దక్కుతోంది. వీటి ధర కూడా 15 కిలోల బాక్సు రూ.వందకిపైగానే పలుకుతోంది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,631.26
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	24,130	1,36,574
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	23,669	1,30,855
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	98.88

అంజనాద్రి కొండపై ఎలుగుబంటి ప్రత్యక్షం



భక్తులకు కనిపించిన ఎలుగుబంటి

కంప్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆంజనేయస్వామి జన్మస్థలమైన అంజనాద్రి కొండపైన సోమవారం సాయంత్రం ఎలుగుబంటి ప్రత్యక్షమైం ది. భక్తులు స్వామిని దర్శించుకుని కొండమీద నుంచి కిందకు దిగుతున్న సమయంలో ఎలుగుబంటి కనిపించింది. కేకలు వేయడంతో కొం డల్లోకి పరుగులు తీసింది. ఎలుగుబంటి కనపడటంతో భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. కొండ కింద ప్రాంతం నుంచి పైభాగం వరకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా కంచె ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

యువకుడి అదృశ్యం



విశ్వాస్ సాయి

కంప్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన విశ్వాస్ సాయి (19) అనే యువకుడు కనిపించలేదని తల్లిదండ్రులు కంప్లి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విశ్వాస్ సాయి బెంగళూరులో బీటెక్ మొదటి సంవత్సరం పూర్తి చేసుకుని సెలవులు రావడంతో కంప్లికి వచ్చాడు. జూలై 30 సాయంత్రం 7.40 వరకు పట్టణంలో ఉన్నాడు. అనంతరం కనిపించకపోవడంతో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నెంబర్ 9480803038కు తెలపాలని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

రాయచూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న టాటాఏస్ వాహనం బైక్‌ను ఢీకొట్టిన కారణంగా సోమవారం జిల్లాలోని మస్కి తాలూకా ముదబాళ క్రాస్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న విజయానందతో పాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని అంబులెన్స్‌లో లింగసుగూరు తాలూకా ఆస్పత్రికి చేర్చారు. చికిత్స పొందుతుండగానే విజయానంద(22) మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో వారికి చికిత్స అందిస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి మస్కి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

టాటా ఏస్‌ను ఢీకొన్న లారీ

- ఇద్దరికి తీవ్ర గాయాలు

బళ్లారిరూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని గోడేహాళ్ చెక్‌పోస్టు వద్ద హగరి వైపు నుంచి బళ్లారికి వెళుతున్న టాటా ఏస్ వాహనాన్ని బళ్లారి నుంచి గుంతకల్లు వైపు వెళుతున్న లారీ ఢీకొనడంతో యర్రిస్వామి, డ్రైవర్ పవన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పరమదేవనహళ్లి పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని క్షతగాత్రులను బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

- జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు మీనల్లి తాయణ్ణ
- రైతులతో కలిసి నిరసన



ఏడీసీ మహమ్మద్ జుబేర్‌కు వినతి పత్రం ఇస్తున్న జేడీఎస్ నాయకులు

బళ్లారి సిటీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రెండు సంవత్సరాలుగా రాష్ట్రాన్ని పాలిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య నేతృత్వంలోని ప్రభుత్వం రైతులకు యూరియా అందించలేక పోతోందని, రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నారని జేడీఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నగరంలో జేడీఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు వినతి పత్రం పంపించారు. ఈ సందర్భంగా జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు మీనల్లి తాయణ్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మంచి వర్షాలు కురవడంతో రైతులు పొలాల్లో పంటలు విత్తారని, అవసరమైన యూరియా ఎరువులను సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమయిందన్నారు. వ్యాపారులు ఎరువులు పక్క రాష్ట్రాలకు బ్లాక్‌లో అమ్ముతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. రాష్ట్రానికి అవసరమైన ఎరువులను పొందడానికి కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 6.8 లక్షల టన్నుల ఎరువులను కేటాయించిందని, అందులో 5.27లక్షల టన్నుల ఎరువులు మాత్రమే అందించారన్నారు. మిగిలిన 1.5 లక్షల టన్నుల ఎరువులను పొందడానికి కేంద్రాన్ని సంప్రదించడంలో విఫలమందన్నారు. దీనివల్ల రాష్ట్రంలో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదని అన్నారు. రాష్ట్రంలోని తీర, కొండ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా ఏర్పడిన వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లకు విపత్తు సహాయ నిధి నుంచి అవసరమైన నిధులను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని పేర్కొన్నారు. మిగిలిన మైదాన ప్రాంతాల్లో ఆరు వారాలుగా వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్ కుమార్ యువఘటక అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, పుష్ప పాల్గొన్నారు.

‘సొసైటీల ద్వారా ఎరువులు సరఫరా చేయాలి’



ఎమ్మిగనూరులో ఎరువుల దుకాణాల వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

కంప్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సొసైటీల ద్వారా ప్రభుత్వమే రైతులకు నేరుగా ఎరువులు సరఫరా చేయాలని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం, గ్రీన్ ఆర్మీ తాలూకా అధ్యక్షుడు వడ్రు వీరేశ డిమాండ్ చేశారు. సోమవారం తాలుకాలోని ఎమ్మిగనూరులో రైతులు నిర్వహించిన ఆందోళనలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలను పెంచిందన్నారు. కర్ణాటకకు అవసరమైన ఎరువులు అందించకుండా రైతులను మోసం చేస్తోందన్నారు. ఎరువులు తగినంతగా సరఫరా కావడం లేదని, దీని కారణంగా రైతులు పంటలకు వాటిని వేయలేక పోతున్నారని తెలిపారు. ఇక్కడి ఎరువుల వ్యాపారులు ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువగా అమ్ముతున్నారని పేర్కొన్నారు. దీంతో రైతులకు మరింత భారమవుతోందన్నారు. రైతులు ఎరువులు కొనడం కష్టంగా మారిందన్నారు. వీటిపై సంబంధిత అధికారులు పట్టించుకోలేదన్నారు. గ్రామంలోని ఎరువుల దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేసి సొసైటీల ద్వారా సరఫరా చేస్తే రైతులకు ప్రయోజనకరంగా వుంటుందన్నారు. కొంతమంది వ్యాపారులు ఎమ్మెల్యే పేరును దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి అలాంటి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే 10వ తేదీన ఎమ్మిగనూరులో నిరసనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అడివయ్యస్వామి, ఎరన్న, జడెప్ప, ఖాసీంసాబ్, జడెప్ప, శివరుద్రప్ప, లింగప్ప పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే దోమల నియంత్రణ



ప్రజలకు సలహాలు ఇస్తున్న డాక్టర్ అబ్దుల్లా

బళ్లారి సిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే దోమలను అరికట్టవచ్చని వ్యాధుల నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ ఆర్.అబ్దుల్లా సూచించారు. సోమవారం బళ్లారి తాలూకాలోని మోకా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిధిలోని వనేరూర్ గ్రామాన్ని సందర్శించి, ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీరు నిలిచి ఉండటం వల్ల డెంగీ వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలని, నీటి పాత్రలను నిత్యం శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎవరికైనా మూడు రోజులకు మించి జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, లేదా కండరాలు, కీళ్లలో తీవ్రమైన నొప్పి ఉంటే సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. వైద్యులు సూచించిన లక్షణాల ఆధారంగా చికిత్స పొందాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌బీటీడీసీపీ సలహాదారుడు ప్రతాప్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ తిమ్మరాజు, హెల్త్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైకిల్ జాతా



సైకిల్ జాతాను ప్రారంభిస్తున్న చీఫ్ పోస్ట్ మాస్టర్ ఆనంద్ వందాళ్

రాయచూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : క్విట్ ఇండియా అభియాన్‌లో భాగంగా సోమవారం నగరంలోని హెడ్ పోస్ట్ ఆఫీసు వద్ద సైకిల్ జాతాను ఉత్సాహంగా నిర్వహించారు. జాతాను చీఫ్ పోస్ట్ మాస్టర్ ఆనంద్ వందాళ్ ప్రారంభించి సైకిల్‌తో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం సైకిల్ తొక్కడం వల్ల శరీరంలోని అన్ని అవయవాలు ఉత్తేజితమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోస్ట్ ఆఫీసు సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో మరింత పారదర్శకత

- పనుల పర్యవేక్షణకు ప్రత్యేక యాప్
- అక్రమాలకు చెక్ : జడ్పీ సీఈఓ



బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద అమలు అవుతున్న పనుల్లో మరింత పారదర్శకత పెంచే ఉద్దేశ్యంతో ప్రత్యేక యాప్‌ను రూపొందించామని జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి మహ్మద్ హారేస్ సుమేర్ తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద జరుగుతున్న పనుల్లో అవకతవకలు గ్రహించిన బళ్లారి జిల్లా పంచాయతీ, పర్యవేక్షణ బృందం పనితీరును పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక యాప్‌ను ప్రవేశ పెట్టిందన్నారు. గత మూడు నెలలుగా నరేగా ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది ఈ యాప్‌ను ఉపయోగించడం తప్పనిసరి చేసిందన్నారు. ప్రతి అధికారి, సిబ్బంది పనికి రిపోర్టు చేసిన వెంటనే ముందుగా యాప్‌లో తమ హాజరు నమోదు చేసుకోవాలని, ఆ తరువాత రోజు చేసిన పనిని నమోదు చేయాల్సి ఉంటుందని వివరించారు. క్షేత్రస్థాయి తనిఖీలు, కార్యాలయం పనులు మొదలైన వాటిని జీపీఎస్ ఫొటోలతో పాటు మొబైల్ యాప్‌కు అప్‌లోడ్ చేయాలని తెలిపారు. గ్యాలరీ నుంచి పాత ఫొటోలు అప్‌లోడ్ చేయడానికి అనుమతి లేదని అన్నారు. జీపీఎస్ ఫొటోలు తీసి ఆ సమయంలో అప్‌లోడ్ చేయడానికి యాప్‌లో ఒక వ్యవస్థను రూపొందించామని వివరించారు. ప్రతి ఒకరి దినచర్య యాప్‌లో నమోదు చేస్తామని తెలిపారు. ఈ యాప్‌ను పాలనాత్మక ఖర్చుతో రూపొందించినట్లు సీఈఓ తెలిపారు. యాప్ ప్రారంభమయిన తరువాత నరేగా పనులపై నిఘా వ్యవస్థ ఉందని తెలుసుకుని పారదర్శకంగా చేస్తున్నారని వివరించారు. పనుల్లో అక్రమాలకు బ్రేక్ వేసినట్లయిందని వివరించారు.

విగ్రహాల తరలింపుపై గ్రామస్థుల ఘర్షణ



గ్రామస్థులను అదుపు చేస్తున్న పోలీసులు

సిరుగుప్ప, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విగ్రహమూర్తులను వేరే ప్రాంతానికి మార్చే విషయంలో మూడు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుని ఉద్రిక్తంగా మారిన సంఘటన సిరుగుప్ప తాలుకాలో గోసబాల్ గ్రామంలో చోటుచేసుకుంది. సోమవారం రెవెన్యూ, పోలీసు అధికారుల ఆధ్వర్యంలో మరిలింగేశ్వర ఆలయ నిర్మాణం, గుర్రాల విగ్రహాలను పాత ఆలయం నుంచి నూతన ఆలయం వరకు మార్పిడి చేయాలనే విషయంపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో మూడు వర్గాలలో ఒకరు ఇక్కడే వుంచాలని, మరొకరు మార్పిడి చేయాలని వాగ్వాదానికి దిగారు. మూడు వర్గాలు ఏకతాటిపైకి రాకుండా ఘర్షణకు పాల్పడ్డారు. ఈ కార్యక్రమంలో సిరిగేరి ఎస్‌ఐ సద్దాం హుస్సేన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి అదుపులోకి తెచ్చారు. రానున్న రోజుల్లో జిల్లా అధికారి ఆదేశాల మేరకు సమస్యను పరిష్కరిస్తామని డీఎస్పీ తెలిపారు. సిరిగేరి ఎస్‌ఐ సద్దాం హుస్సేన్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ, ఎమ్మెల్యే



ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

కంప్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య జన్మదిన వేడుకల సందర్భంగా విజయనగరం ఎంపీ ఈ తుకారాం, సండూరు ఎమ్మెల్యే అన్నపూర్ణ దంపతులు బెంగళూరులో సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. పేదలను దృష్టిలో వుంచుకుని తమ నాయకుడు ఐదు పథకాలు ప్రవేశపెట్టారని, వీటితో ఎంతో మందికి లబ్ధి చేకూరుతోందని వారు తెలిపారు. బళ్లారి, విజయనగర్ జిల్లాల్లో ఇప్పటికే రోడ్ల అభివృద్ధి పనులు, రైల్వే ఫ్లైఓవర్ పనులు జోరుగా కొనసాగుతున్నాయన్నారు.

హొసపేట ఏపీఎంసీ కార్యదర్శిగా బసవరాజు



బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): హొసపేట ఏపీఎంసీ కార్యదర్శిగా పనిచేసిన సిద్దయ్య స్వామి కొప్పళ్ జిల్లా కేంద్రానికి బదిలీ కావడంతో ఆయనస్థానంలో వి.బసవరాజును ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయనగర జిల్లా కేంద్రమైన హొసపేట వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ సమితి(ఏపీఎంసీ)కి కూరగాయలతో పాటు వాణిజ్య ఉత్పత్తుల్లో అరటి ఎక్కువగా వస్తుంటుందని తెలిపారు. మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తులు తీసుకొచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని అన్నారు. రైతులకు అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని వివరించారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శి బసవరాజుకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఈశ్వరచంద్ర విద్యాసాగర్ సేవలను స్మరించుకోవాలి

బళ్లారి సిటీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి అక్షరాస్యురాలు సంఘ సంస్కర్త ఈశ్వరచంద్ర విద్యాసాగర్ సేవలను స్మరించుకోవాలని ఏఐఎంఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల తెలిపారు. ప్రభుత్వ ఫస్ట్ గ్రేడ్ మహిళా కళాశాలలో మానవతావాది ఈశ్వరచంద్ర విద్యాసాగర్ వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశంలో మంజుల మాట్లాడుతూ .. ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్‌ను భారతదేశ మహిళలు గుర్తుంచుకోవాలని తెలిపారు. ఆ రోజుల్లో పితృస్వామ్య సమాజం చదువుకున్న బాలికలను బయటకు వెళ్లనివ్వలేదని, మహిళల కోసం స్వంత ఖర్చుతో 33 పాఠశాలలను ప్రారంభించారని, ఇది ఒకే వ్యక్తి సాధించిన అరుదైన విజయం అని కొనియాడారు. వితంతువుల పునర్వివాహం కోసం పోరాటం చేశారని తెలిపారు. ఆయన తన జీవితంలో బోధించిన వాటిని అక్షరాలా అనుసరించి ఇతరులకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఏఐఎంఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు ఈశ్వరి మాట్లాడుతూ.. నేడు ఆడ భ్రూణహత్యలు, బాల్యవివాహాలు, బాల్య గర్భాల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలన్నింటి గురించి ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రజ్ఞ, బోధనా సిబ్బంది విజయలక్ష్మి, సౌమ్య, పుష్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

మహనీయుల జయంతులను ఘనంగా ఆచరిద్దాం

సిరుగుప్ప, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మహనీయుల జయంతులు, స్వాతంత్ర్య దినోత్సవం, కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా ఆచరిద్దామని డిప్యూటీ తహసీల్దార్ సిద్దార్థ పిలుపునిచ్చారు. సోమవారం సిరుగుప్ప తహసీల్దార్ కార్యాలయంలో మూడు జయంతులను ఆచరించడంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆగస్టు 9వ తేదీన నూలి చందయ్య జయంతి, 15 స్వాతంత్ర్య దినోత్సవం, 16న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఈ మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సమాజ సభ్యులు పాల్గొని చర్చించారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున, తాలూకా సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ మద్దేరు సిద్దయ్య, వివిధ సంఘ సంస్థల పదాధికారులు, ప్రభుత్వఅధికారులు పాల్గొన్నారు.

బంగాళి క్యాంపులో ఘర్షణ.. 16 మంది పై కేసు

రాయచూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింధనూరు తాలూకా బంగాళి (ఆర్‌హెచ్-3) క్యాంపులో సోమవారం జరిగిన ఘర్షణ సందర్భంగా పోలీసులు 16 మంది పై కేసు నమోదు చేశారు. క్యాంపులో నివసిస్తున్న అంగాత్ సిగ్దార్ అనే వ్యక్తి ఇటీవల మహారాష్ట్రలో మృత్యువాత పడగా.. దానికి సంబంధించి ఘర్షణ జరిగినట్లు పోలీసులకు సమాచారం అందింది. అంగాత్ సిగ్దార్‌ను దీపంకర్ అనే వ్యక్తియే పని కోసం అని మహారాష్ట్రకు తీసుకెళ్లగా అక్కడ ఆయన చనిపోవడంతో దాన్ని సహజ మరణంగా దీపాంకర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీనిపై అంగాత్ సిగ్దార్ కుటుంబం ఆయన బంధువులంటు దీపాంకర్ ఇంటి పై దాడి చేయడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో అక్కడికి వెళ్లిన సింధనూరు పోలీసులు పరిస్థితిని చక్కదిద్ది 16 మంది పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా గలాభాను నివారించేందుకు వెళ్లిన పోలీసులపై కూడా కొంత మంది నిందితులు దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరిలో ఏఎస్ఐతో పాటు ముగ్గురు కానిస్టేబుళ్లు గాయపడ్డారు.

వాలిన ఇంటిని తొలగించిన అధికారులు



ఇంటిని తొలగిస్తున్న సిబ్బంది

రాయచూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 8వ వార్డు పరిధిలో నిర్మాణ లోపం వల్ల వాలిన ఇంటిని మహానగర పాలిక అధికారులు సోమవారం తొలగించారు. ఇంటి యజమానికి 10 రోజుల క్రితమే ఇంటిని పూర్తిగా తొలగించాలని ఆదేశించినా ఇప్పటి వరకు స్పందించకపోవడంతో మహానగర పాలిక అధికారులు నేరుగా చర్యలకు దిగారు. నగరంలోని 8వ వార్డు పరిధిలోని దస్తగీర్ అనే వ్యక్తి మూడంతస్తుల ఇంటి నిర్మాణం చేయగా.. పై అంతస్తు వరిగి పక్క ఇంటి పై వాలిపోయింది. 10 రోజుల క్రితం ఈ సంఘటన నగరంలో సంచలనంగా మారగా స్పందించిన అధికారులు యజమానికి నోటీసులు ఇచ్చారు. ఇప్పటి వరకు కేవలం పై అంతస్తును మాత్రమే తొలగించిన యజమాని కింది వాటిని అలాగే వదిలి వేయడంతో అధికారులు ఆయనకు హెచ్చరిక జారీ చేశారు. సగం వాలి ఉన్న ఇల్లు ప్రమాదకరంగా ఉందని ఇరుగుపొరుగు వారు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మహానగర పాలిక అధికారులు ప్రత్యక్ష కార్యాచరణకు దిగారు.

హోసూరు జోన్

యల్లమ్మదేవి ఆలయంలో విశేష పూజలు



కలశాలతో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

హోసూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శూలగిరి సమీపాన రామపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన యల్లమ్మదేవి దేవాలయంలో విశేషపూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు ఉపవాసదీక్షలో పాల్గొని పాలకుండలతో ఊరేగారు. తెన్‌పెన్నై నదికి చేరుకుని నదీతీరంలో పూజలు చేశారు. అనంతరం ఊరేగింపుగా యల్లమ్మదేవి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి క్షీరాభిషేకం అనంతరం పాలు, పన్నీరు, పసుపు, కుంకుమ, ఫలాలు వంటి విశేషద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి, అన్నదానం చేపట్టారు. కాగా అగ్నిగుండంపై భక్తులు నడిచి తమ మొక్కులు తీర్చుకున్నారు.



అగ్నిగుండంపై భక్తులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

కంప్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని కుడితిని పట్టణ పంచాయతీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 16, 17 వార్డుల్లో ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సమాజ సేవకుడు సత్యప్ప, కౌన్సిలర్ లెనిన్ మాట్లాడుతూ.. ప్రజలు మలవిసర్జన బయటికి చేయకుండా ప్రభుత్వం ఇచ్చిన సదుపాయాలు సద్వినియోగం చేసుకుని ప్రతి ఇంటా శౌచాలయాలు చేసుకుని పట్టణాన్ని సుందరంగా వుంచుకోవాలన్నారు. ప్లాస్టిక్ ముక్త పట్టణం కావాలన్నారు. హొస్పేట రోడ్డులోని ఆరుబయట పరిశుభ్రం చేపట్టి ముగ్గులు వేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రమేష్, దేవేంద్ర, హనుమంతు, నళినీ యాస్మిన్ పాల్గొన్నారు.

బంతిపూల ధరకు రెక్కలు

కిలో రూ.80 పలకడంపై రైతుల హర్షం



తోటలో కోతకు సిద్ధంగా ఉన్న బంతిపూలు

హోసూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పండుగల సీజన్‌లో ఎట్టకేలకు బంతిపూలకు ధర ఆశాజనకంగా ఉంటోంది. హోసూరు మార్కెట్‌లో కిలో రూ.20 పలికిన ధర రెండురోజులుగా కిలో రూ.80 పలుకుతోంది. దీంతో పూలరైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీజన్ ప్రకారం పండించే ఎర్రబంతిపూలు పండుగల సమయంలో కొంత ధర పలుకుతాయి. సాధారణంగా ఎర్రబంతి పూలు కిలో రూ.10-20 ఉంటాయి. కానీ ఈసారి అనూహ్యంగా కిలో రూ.80 పలకడం సంతోషంగా ఉందని పలువురు రైతులు అభిప్రాయపడ్డారు.

అథ్లెటిక్స్‌లో రాణించిన విద్యార్థులు



జ్ఞాపికలతో విద్యార్థులు

హోసూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఆధ్వర్యంలో కృష్ణగిరి తూర్పు జిల్లా కావేరిపట్టణం, తూర్పు యూనియన్ కావేరిపట్టణం జిల్లాస్థాయి స్థాయి అథ్లెటిక్స్ పోటీలు వామంగళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగాయి. బర్గూరు ఎమ్మెల్యే మతియజగన్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రిన్సిపాల్ ఆర్ శివప్రకాశ్, పేరెంట్స్ టీచర్ అసోసియేషన్ స్కూల్ మేనేజిమెంట్ కమిటీ నిర్వాహకులు, రాణించిన విద్యార్థులకు జ్ఞాపికలు అందచేసి అభినందించారు.

పోక్సో కేసులో తాతప్ప అరెస్టు

రాయచూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహం చేసుకున్న తాతప్పను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. రాయచూరు తాలూకా శక్తినగర్‌కు చెందిన తాతప్పపై రాయచూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. తాతప్ప తన భార్యతో కలిసి జిల్లాలోని గుర్జాపూర్ బ్రిడ్జి కం బ్యారేజ్ వద్ద కృష్ణనదిపై సెల్ఫీ దిగుతూ నదిలోకి పడిపోయాడు. తన భార్య తోసేసిందని తాతప్ప ఆరోపించగా, కాలు జారి తనే నదిలోకి పడిపోయాడని భార్య పేర్కొన్నారు. పరస్పర విరుద్ధ ప్రకటనల నేపథ్యంలో వివాదం చర్చల్లోకి వచ్చింది. తాతప్పను కాపాడే వీడియో వైరల్ అయింది. ఈ క్రమంలో తాతప్ప భార్య బాలిక అని, ఆమెకు ఇంకా 18 ఏళ్లు నిండలేదని తేలింది. దీంతో యాదగిరి జిల్లాకు చెందిన మహిళ హక్కుల కమిటీ బాధ్యులు జిల్లా మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికను వివాహం చేసుకున్న తాతప్పపై పోక్సో కేసు నమోదైంది. నిందితుడు పరారీలో ఉండగా, పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. రిమ్స్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరిచారు. బాల్య వివాహం జరిపించినందుకు బాలిక తల్లి, యువకుడి తల్లిపై కూడా కేసులు నమోదు చేశామని రాయచూరు మహిళా పోలీసులు తెలిపారు.